## విపత్కర పరిస్థితులకు సన్నద్ధం కావాలి

**ములుగు ఎస్పీ శబరీశ్**



ములుగు, మే 27 (నమస్తే తెలంగాణ) : రానున్న వర్షాకాలంలో వరదలు వచ్చే ప్రదేశాలను గుర్తించి ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ జిల్లా పోలీస్ యంత్రాంగానికి సూచించారు. మంగళవారం ఆయన నెల వారి నేర సమీక్ష నిర్వహించి నమోదైన కేసుల వివరాలపై స్టేషన్ల వారీగా ఆరా తీశారు. కేసుల్లో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దొంగతనాలు, ఆర్థిక నేరాల్లో ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చేయాలని, పోగొట్టుకున్న నగదు లేదా వస్తువులను బాధితులకు అప్పగించేలా కృషి చేయాలన్నారు. పాత కేసుల దర్యాప్తులో పురోగతి పరిశీలించి పూర్తి చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణ, సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళలపై జరిగే నేరాలపై వీలైనంత త్వరగా విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో గోదావరి పరీవాహక గ్రామాల్లో అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీలు కిశోర్ కుమార్, రవీందర్, సీఐలు శంకర్, శ్రీనివాస్, కుమార్, ఎస్సైలు వెంకటేశ్వరరావు, సతీశ్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజుద్దీన్, సూరి, వెంకటేశ్, రాజ్‌కుమార్, కృష్ణప్రసాద్, తిరుపతి, జగదీశ్, ఐటీ కోర్ టీమ్, డీసీఆర్బీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌రెడ్డి

## రాష్ట్రంలో రౌడీ పాలన

**కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు భరత్‌రెడ్డి**

కృష్ణకాలనీ, మే 27: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో రౌడీల పాలన రాజ్యమేలుతునవదని కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ హెరాల్డ్ కేసు, మిస్ వరల్డ్ అవమాన ఘటనలపై ప్రజల దృష్టిని మళ్లించడానికే సిరిసిల్లలో కుట్ర రాజకీయాలకు తెరలేపుతున్నారన్నారు. సిరిసిల్ల క్యాంపు కార్యాలయంపై దాడిని కేటీఆర్ సేన తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. కాంగ్రెస్ నాయకులు కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గాయపడిన కేటీఆర్ సేన నాయకులకు ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే అన్యాయంగా అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కేటీఆర్ సేన ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో కేటీఆర్ సేన ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మైనాల నరేశ్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, భూపాలపల్లి నియోజకవర్గం అధ్యక్షుడు పిన్నింటి మణిదీప్‌రావు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన విద్యార్థులతో జీఎం రాజేశ్వర్‌రెడ్డి

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి**

కృష్ణకాలనీ, మే 27 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ స్టేడియంలో 27 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి జీఎం హాజరై క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా జీఎం క్యాంప్‌లో పెద్ద మొత్తంలో విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందని, తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రతీరోజు క్రీడా మైదానానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. సుమారు 130 మంది విద్యార్థులకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. నిత్యం సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించాలన్నారు. ఏరియా అధికార ప్రతినిధి మారుతి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేశ్, ఐఎన్‌టీసీ వైస్ ప్రెసిడెంట్ మధుకర్‌రెడ్డి, క్రీడల కార్యదర్శి పీ శ్రావణ్ కుమార్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, కోచ్‌లు తిరుపతి నాయక్, రఘువీర్, నెహ్రూ, శరత్, ఐశ్వర్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ఎలాంటి విద్యార్హత లేకున్నా పర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.

NT-325336

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# ‘ఆయుష్’ పై ఎందుకింత నిర్లక్ష్యం

- భవనం సిద్ధంగా ఉన్నా అందని వైద్యం
- ఏడాదిగా ఎదురుచూపులు
- ఇంకా నర్సింగ్ కళాశాల ఆధీనంలోనే భవనం




నర్సింగ్ కళాశాల ఆధీనంలో ఉన్న ఆసుపత్రి భవనం

జయశంకర్ భూపాలపల్లి, మే 27 (నమస్తే తెలంగాణ) : జిల్లా ప్రజలకు ఆయుష్ వైద్యం అందని ద్రాక్షలా మారింది. జిల్లా కేంద్రంలో 50 పడకల ఆయుష్ వైద్యశాల భవనం నిర్మించి ఏడాది అవుతున్నా అందులో ఇప్పటికీ ఓపీ ప్రారంభం కాలేదు. ఈ భవనాన్ని నర్సింగ్ కళాశాలకు అప్పగించి ఆయుష్‌ను అటకెక్కించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ప్రజలు ఆయుష్ సేవల కోసం ఎదురు చూస్తున్నా ఉన్నతాధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఏడాది కాలంగా నేచర్‌క్యూర్(పంచకర్మ), యునాని, హోమియోపతి, ఆయుర్వేద వైద్య సేవలకు బ్రేక్ పడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేవలం వరంగల్‌లో మాత్రమే 150 పడకల అనంత లక్ష్మి ఆయుర్వేదిక్ హాస్పిటల్ (వైద్య కళాశాలకు అనుబంధం) అందుబాటులో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులు లేవు. ఈ క్రమంలో ఆయుష్ వైద్య సేవలను విస్తరించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్, సిద్దిపేట జిల్లాల్లో ఒక్కో భవనానికి రూ.10 కోట్లతో మూడు 50 పడకల ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రుల పనులను ప్రారంభించి పూర్తి చేయించింది. కాగా, జిల్లాలో భవనాన్ని నిర్మించి ఏడాది గడుస్తున్నా ఇంత వరకు అందులో సౌకర్యాలు కల్పించలేదు. ఫర్నిచర్, మెడిసిన్ రాలేదు. ఇదిలా ఉండగా ప్రారంభోత్సవానికి ముందే ఈ భవనాన్ని తాత్కాలికంగా నర్సింగ్ కళాశాలకు అప్పగించగా ప్రస్తుతం నర్సింగ్ తరగతులు కొనసాగుతున్నాయి. దీంతో ఆయుష్ అధికారులు ఫర్నిచర్, ఇతర వైద్య పరికరాలు తీసుకురావడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

### భవనం నర్సింగ్ కళాశాలకేనా

ఆయుష్ భవనం ఇక నర్సింగ్ కళాశాలకే అప్పగిస్తారా.. సేవలను అటకెక్కిస్తారా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. నర్సింగ్ కళాశాల నుంచి భవనాన్ని ఆయుష్‌కు అప్పగిస్తే వైద్య సేవలను ప్రారంభించేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే దవాఖానకు ఎన్ఆర్‌హెచ్ఎం నుంచి డిప్యూటేషన్‌పై వైద్యులను అలాట్ చేశారు. ఫర్నిచర్, మెడిసిన్, స్టాఫ్ రావాల్సి ఉంది. ఓపీ ప్రారంభమైతే ప్రజలకు ఆయుర్వేద, యోగా, నేచురోపతి, యునాని, హోమియోపతి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ సంప్రదాయక వైద్యం కోసం ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మూడు ఆయుర్వేదిక్, రెండు హోమియోపతి, మూడు యునాని డిస్పెన్సరీలు ఉన్నాయి. దామెరకుంట, ధర్మారావుపేట, కొడవటంచలో ఆయుర్వేదిక్ డిస్పెన్సరీలు ఉండగా దామెరకుంట, కొడవటంచలో రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్‌లు సేవలందిస్తున్నారు. అలాగే ధర్మారావుపేటలో ఎన్ఆర్‌హెచ్ఎం మెడికల్ ఆఫీసర్ వారానికి మూడు రోజులు (గురు, శుక్ర,శని) వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే చల్లగరిగె, మహాముత్తారంలో హోమియోపతి డిస్పెన్సరీలు ఉండగా చల్లగరిగెలో డాక్టర్ ఉండగా మహాముత్తారంలో లేరు. మహదేవపూర్, వల్లెంకుంట, మొగుళ్లపల్లిలో యునాని డిస్పెన్సరీలు ఉండగా మహాదేవపూర్‌లో డిప్యూటేషన్‌పై డాక్టర్ సేవలు అందిస్తుండగా వల్లెంకుంటలో బిల్డింగ్ లేదు. మొగుళ్లపల్లిలో డాక్టర్, స్టాఫ్ లేక డిస్పెన్షరీ మూసివేశారు.

> **డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..**
>
> జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన 50 పడకల ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభించాలని ఆయుష్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. 50 బెడ్లతో కంప్లీట్‌గా ఆయుర్వేదిక్, యోగా, నేచురోపతి, యునాని, హోమియోపతి వైద్యం అందిస్తాం. ఈ వైద్యం ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కానీ, భవనం ఇంకా మాకు అప్పగించలేదు. ఎన్ఆర్‌హెచ్ఎం నుంచి డిప్యూటేషన్‌పై వైద్యులను కేటాయించారు. మెడిసిన్, స్టాఫ్, ఫర్నిచర్ రావాల్సి ఉంది.
>
> *– డాక్టర్ లీ చంద్ర, ఆయుష్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్*



సర్వేయర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

## భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

**ములుగు కలెక్టర్ దివాకర**

ములుగురూరల్, మే 27 : భూముల సర్వే లో సర్వేయర్ల పాత్ర కీలకమని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. మంగళవారం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో నిర్వహించిన లైసెన్స్ సర్వేయర్ల ధృవపత్రాల పరిశీలన, సామగ్రి పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జూలై 26 వరకు లైసెన్స్ సర్వేయర్లకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు. ప్ర భుత్వ భూముల సర్వే, అసైన్డ్ భూముల సర్వే, ప్రాజెక్టుల సందర్భంగా భూ సేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే, ఎఫ్ లైన్ సర్వే వంటి సర్వేల సమయంలో సర్వేయ ర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. రెవెన్యూకు సంబంధించి గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారానికి సర్వేలో కీలక పాత్ర సర్వేయర్లకు ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ సర్వే సామగ్రిని సర్వేయర్లకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, సంబంధిత అధికారులు ఉన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, వ్యవసాయ ప్రణాళిక తదితర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దివాకర, అదపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, అధికారులు ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు.

## బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలి

**డీసీఎస్‌వో ఫైసల్ హుస్సేన్**



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎస్‌వో ఫైసల్ హుస్సేన్

ఏటూరునాగారం, మే 27 : వచ్చే నెల 1 నుంచి మూడు నెలల రేషన్ బియ్యం కోటా ఒకేసారి పంపిణీ చేయాలని డీసీఎస్‌వో ఫైసల్ హుస్సేన్ కోరారు. ఈ మేరకు జీసీసీ డివిజన్ కార్యాలయం వద్ద ఏటూరునాగారం, ములుగు, వెంకటాపురం బ్రాంచి పరిధిలోని సేల్స్‌మెన్లు, డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. పంపిణీపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రేషన్ డిపోలు నిత్యం తెరిచి ఉంచాలని ఆదేశించారు. డీలర్లు, సేల్స్‌మెన్లు తమకు కేటాయించిన మూడు నెలల స్టాకును తీసుకెళ్లాలని సూచించారు. కార్డుదారులందరికీ ఒకే సారి మూడు నెలల కోటా బియ్యం అందించాలన్నారు. డిపోలో స్టాకు అయిపోయిన వెంటనే మళ్లీ గోదాం నుంచి తీసుకోవాలన్నారు. హమాలీల సంఖ్య కూడా పెంచాలని జీసీసీ అధికారులకు సూచించారు. బియ్యం పంపిణీలో ఎలాంటి తేడాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రతీ కార్డు దారుడికి మూడు నెలల కోటా అందించేపుడు నెల వారిగా బయో మెట్రిక్ తీసుకోవాలని సేల్స్‌మెన్లు, రేషన్ డీలర్లకు సూచించారు. సమావేశంలో జీసీసీ ఇన్‌చార్జి డీఎం కుంజ వాణి, వెంకటాపురం మేనేజర్ స్వామి, డీటీ రాహుల్ వర్మ పాల్గొన్నారు.

## పుష్కరాల్లో భాగస్వాములైన వారందరికీ కలెక్టర్ అభినందనలు

కృష్ణకాలనీ, మే 27 : సరస్వతీ పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు భాగస్వాములైన అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ రాహుల్‌శర్మ అభినందనలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విధుల్లో నిబద్ధత, సమగ్ర ప్రణాళిక, అవిశ్రాంత కృషి వల్ల లక్షలాది మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించారన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమం నిర్వహించడం ద్వారా జిల్లా పరిపాలనా సామర్థ్యం, ఐక్యతను నిరూపించుకున్నామని తెలిపారు. పుష్కరాల సమాచారాన్ని ప్రజలకు చేరవేసిన పాత్రికేయులను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో సేవా దృక్పథాన్ని కొనసాగిస్తూ ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు.

## డిమాండ్ ఉన్న పంటలు సాగుచేయాలి

**జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు**

ఏటూరునాగారం, మే 27 : హార్టికల్చర్ పంటల్లో తక్కువ నీటితో మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి రైతులు ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు అన్నారు. మండలంలోని చిన్నబోయినపల్లి, పెద్ద వెంకటాపురంలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగు, పండ్ల తోటలు, డ్రిప్ సేద్యం, రాష్ట్ర వెదురు మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన తదితర పథకాల ద్వారా ఉద్యాన వనాలకు సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ సంవత్సరం 152 ఎకరాల్లో పండ్ల తోటలు, 3 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఎకరానికి 57 ఆయిల్ పామ్ మొక్కలు 90 శాతం సబ్సిడీపై ఇవ్వనున్నట్లు చెప్పారు. రూ. 1,140 చెల్లిస్తే 57 మొక్కలు సరఫరా చేస్తామన్నారు. యాజమాన్యం కింద ఎకరానికి రూ. 4,200 చొప్పున నాలుగేండ్ల వరకు అందిస్తామన్నారు. ఎకరానికి బిందు సేద్యంపై రూ. 22,518తో రాయితీపై పరికరాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయిల్ పామ్ సాగుకు నాలుగు సంవత్సరాలు కష్టపడితే 30 ఏండ్లు ఆదాయం పొందవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, బీసీ రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందిస్తామన్నారు. ఆయన వెంట హార్టికల్చర్ ఆఫీసర్ లావణ్య ఉన్నారు.



చిన్నబోయినపల్లిలో తోటను పరిశీలిస్తున్న సంజీవరావు




మల్హర్ : కొయ్యూరులో ధాన్యం చుట్టూ చేరిన నీరు



మహదేవపూర్ : కాళేశ్వరం ప్రధాన రహదారిపై పారుతున్న వరద

## అకాల వర్షాలతో అన్నదాతలు ఆగమాగం

కాటారం/మహదేవపూర్,(కాళేశ్వరం) /మల్హర్/ ఏటూరునాగారం, మే 27 : జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని పలు మండలాల్లో మంగళవారం అకాల వర్షం కురిసింది. సాయంత్రం గాలి దుమారంతో ప్రారంభమై కుండ పోత వర్షం పడింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. కాటారం మండల కేంద్రంతో పాటు దామెరకుంట, శంకరంపల్లి, ధన్వాడ, రేగులగూడెం, గారెపల్లి, గంగారం తదితర గ్రామాల్లోని కేంద్రాల్లో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. వర్షంతో వడ్లను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే కాంటాలు వేసి కొనుగోలు చేయాలని కోరుతున్నారు. మహదేవ్‌పూర్ మండలకేంద్రంతో పాటు బ్రాహ్మణపల్లి, పెద్దంపేట, ఎన్కపల్లి, రాపల్లి కోట, బొమ్మాపూర్, బీరసాగర్, అంబట్‌పల్లి, కుదురుపల్లి, ఎడపల్లి, సూరారం, బెగ్లూర్, అన్నారం, పల్గుల, కుంట్లం, కాళేశ్వరంలో ప్రధాన రహదారులు జలమయమైయ్యాయి. కుదురుపల్లి వాగు వరద నీటితో ప్రవహించింది. మల్హర్ మండలం కొయ్యూరులో సాయత్రం 4 నుంచి 6:30 గంటల వరకు కురిసిన వానకు ధాన్యం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా అధికారులను రైతులు వేడుకుంటున్నారు.



ఎమ్మెల్సీ కవితతో నరేశ్ నేత

## సింగరేణి జాగృతి ఏరియా కో ఆర్డినేటర్‌గా నరేశ్ నేత

కృష్ణకాలనీ, మే 27 : సింగరేణి జాగృతి భూపాలపల్లి ఏరియా కోఆర్డినేటర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన నరేశ్ నేతను నియమిస్తూ సింగరేణి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా, సింగరేణి సంస్థను కాపాడమే ధ్యేయంగా సింగరేణి జాగృతిని ఏర్పాటు చేస్తున్నట్లు కవిత తెలిపారు. సింగరేణి జాగృతి టీబీజీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తుందన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కామెర గట్టయ్య

## నూతన బదిలీ సర్క్యులర్‌ను రద్దు చేయాలి

కృష్ణకాలనీ, మే 27: నూతన బదిలీ సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బాతాల రాజన్న భవన్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం బదిలీల పేరుతో కార్మికులను తమ చెప్పు చేతుల్లో ఉంచుకోవడానికి తీసుకొస్తున్న నల్ల చట్టం, నాలుగు కోడ్‌ల విధానంలో భాగమే సర్క్యులర్ అని మండిపడ్డారు. కార్మికులపై దాడి చేసే సర్కులర్‌ను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్‌యూఎస్ కార్మిక సంఘం నాయకులు దాసరి జనార్దన్, కాసర్ల ప్రసాద్‌రెడ్డి, నామాల శ్రీనివాస్, రాళ్లబండి బాబు, జయశంకర్, సాజిద్ పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**ములుగు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ**



మాట్లాడుతున్న మహేందర్‌జీ

ములుగురూరల్, మే 27 : ములుగును మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన జిల్లా స్థాయి నార్కో కోర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాల భారిన పడకుండా చూడాలని ఆదేశించారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కళాశాలలు, వివిధ వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పెడదోవ పట్టకుండా చూడాలన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ కిశోర్, ఎస్సై సురేశ్, డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పావని, బీసీ, ఎస్సీ, మైనార్టీ, ఎక్సైజ్ శాఖల అధికారులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం పాల్గొన్నారు.

## పూర్తిస్థాయిలో ధాన్యం కొంటాం

**భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్**

గణపురం, మే 27 : రైతులు అధైర్య పడొద్దని, పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని బస్వరాజుపల్లిలోని కొనుగోలు కేంద్రాలను మంగళవారం సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. వర్షంతో కేంద్రాల్లో ధాన్యం తడిచి మొలకెత్తిందని, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండడంతో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించామన్నారు. రైతులు అధైర్య పడొద్దని సకాలంలో లారీలు తెప్పించి మిల్లులకు తరలిస్తామన్నారు. ఆయన వెంట జిల్లా సివిల్ సప్లయ్ అధికారులున్నారు.



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

## అందుబాటులో జీలుగ విత్తనాలు

వెంకటాపురం(నూగూరు)/ కాటారం, మే 27 : వెంకటాపురం (నూగూరు) సొసైటీ కార్యాలయం, కాటారం మండలం దామెకరంట డీసీఎంఎస్ వద్ద సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవోలు నవీన్, పూర్ణిమ మంగళవారం తెలిపారు. పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు తీసుకువచ్చి విత్తనాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. 30 కిలోల బస్తాకు రూ.2137, జనుము 40 కేజీల బస్తాకు రూ.2,510 ధర ఉందన్నారు.

## ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు

వెంకటాపురం(నూగూరు), మే 27 : మండలకేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి జ్యోతి ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 87 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ములుగు ఏరియా దవాఖానకు పంపించారు. వైద్యాధికారులు వినయ్, పవన్, హెచ్ఈవో సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ యాకలక్ష్మి పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్లపై కేసు నమోదు

ఏటూరునాగారం, మే 27 : మండలంలోని ఆకులవారి ఘనపూర్‌లో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. సోమవారం సాయంత్రం పక్కా సమాచారం రావడంతో పోలీసులు పేకాట ఆడుతున్న శిబిరంపై ట్రైనీ ఎస్సై దాడులు నిర్వహించారు. మండలకేంద్రానికి చెందిన పీ సూర్యనారాయణ, ఎస్ నాగరాజు, ఈ వెంకన్న, సీహెచ్ బాలరాజు, బీ వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో రూ. 9వేల వరకు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

## ఫర్టిలైజర్స్ డీలర్లతో సమావేశం

మహాముత్తారం, మే 27 : మండలంలోని బోర్లగూడెం రైతు వేదికలో మహదేవపూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు కే శ్రీపాల్ ఫర్టిలైజర్ షాప్స్ డీలర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. వానకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని, లూజు పతి విత్తనాలు, హాట్ కాటన్ విత్తనాలు అమ్మొద్దన్నారు. విత్తనాలు ఎమ్మార్పీకి మించి అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డ్, నేమ్ బోర్డులు మెయింటెన్ చేయాలన్నారు. విత్తనాలు, ఎరువులు కృత్రిమ కొరత సృష్టించొద్దని ఆదేశించారు. ఏవో జీ అనూష , వ్యవసాయ విస్తరణ అధికారులు ఏ శివకృష్ణ, శశివర్ధన్, ప్రవళిక పాల్గొన్నారు.

## ఫిజిక్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

గోవిందరావుపేట, మే 27 : మండలంలోని చల్వాయి మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్ లెక్చరర్ పోస్టు ఖాళీ ఉందని, అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గండు కుమార్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక నియామకమైన ఈ పోస్టుకు ఎంఎస్సీ(ఫిజిక్స్), బీఈడీ అర్హత కలిగి ఉండాలని, వేతనం రూ.18200 ఉంటుందన్నారు. ఈ నెల 28 నుంచి జూన్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని, 6న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కళాశాల సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల మెరిట్ జాబితాను కళాశాల నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు తెలిపారు. జాబితా ప్రకారం విద్యార్థులు మే 29 నుంచి జూన్ 2 వరకు కళాశాలలో ప్రవేశం పొందవచ్చునని తెలిపారు. వివరాలకు 8096350115ను సంప్రదించాలని సూచించారు.

## ఈ శ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి

కృష్ణకాలనీ, మే 27 : జిల్లాలో కొరియర్, హోమ్ సర్వీసెస్, ఫుడ్ డెలివరీ, ఏసీ టెక్నీషియన్స్, గ్రాఫిక్స్ డిజైనర్స్, వీడియో ఎడిటర్స్ వంటి విధులు చేసేవారు ఈశ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా సహాయక కార్మిక శాఖ అధికారి వీ వినోద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక, ఉపాధి మంత్రిత్వ శక్తి అమెజాన్, ఫ్లిప్ కార్టు, జోమాటో, స్విగ్గీ వంటి సంస్థల్లో పని చేసే వారిని కార్మికులుగా గుర్తిస్తూ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను వర్తింపజేస్తుందన్నారు. హెల్ప్ లైన్ నంబర్ 14434కు ఫోన్ చేసి సందేహాలను పరిష్కరించుకోవాలని సూచించారు.

## చెరువు కట్ట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మొగుళ్లపల్లి, మే 27 : చెరువు కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు మొగుళ్లపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రావిశెట్టి రమేశ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం శివారులోని పెద్దమ్మ చెరువు కట్టను గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు జేసీబీతో గండికొట్టి పైపులైన్ వేసుకున్నారన్నారు. దీంతో రానున్న వర్షకాలంలో చెరువు నిండి కట్టను ధ్వంసం చేసిన ప్రాంతంలో గండిపడే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల ఇప్పటికే చెరువులో ఉన్న సుమారు రూ.2లక్షల విలువ చేసే చేపలు చేతికి రాకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టను ధ్వంసం చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, వారు వేసిన పైపులైన్ తొలగించి న్యాయం చేయాలని కోరారు.

## స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కృష్ణకాలనీ, మే 27: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, వికలాంగ, మైనార్టీ, ఫ్రెష్, రెన్యూవల్ విద్యార్థులు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఈ నెల 31 తేదీలోగా http://telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

గణపురం, మే 27 : పట్టా పాస్ బుక్ ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో దేశబోయిన ఐలయ్య కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో ఆయన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారుల క్లస్టర్లలో రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారని, రైతులందరూ వినియోగించుకోవాలన్నారు. అలాగే సబ్సిడీలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జీలుగ విత్తనాలు కావాల్సినవారు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్ ప్రతులతో మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి రావాలని సూచించారు. ఏఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

## అసైన్డ్ పట్టాను రద్దు చేయాలి

ములుగురూరల్, మే 27 : వెంకటాపూర్ మండలం జవహర్ నగర్ గ్రామ శివారులో ప్రభుత్వం ఓ కుటుంబానికి 36.34 ఎకరాలకు అసైన్డ్ పట్టా 1995లో ఇచ్చిందని, ఆ వ్యక్తిది ఆ మండలం సంబంధించిన కుటుంబం కాదని, వెంటనే పట్టాను రద్దు చేయాలని కోరుతూ అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చిన నుంచి 2025 నాటికి సదరు భూమి ఎక్కడో ఉందో తెలియని పరిస్థితి ఉందన్నారు. లక్ష్మీదేవిపేట నుంచి జవహర్‌నగర్ వరకు వందల మందికి ఇలాంటి అక్రమ అసైన్డ్ పట్టాలు ఇచ్చారని, వాటన్నింటినీ రద్దు చేయాలని ఆయన కోరారు. నాయకులు నాగవెల్లి సత్యనారాయణ, సరసాని రవీందర్, గూడూరు సదాశివరెడ్డి ఉన్నారు.

## వంట కార్మికుల వేతనాలు చెల్లించాలి

ములుగురూరల్, మే 27 : కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఆ పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. ములుగులో మంగళవారం ఆయన కార్మికులతో కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో వంట కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గడ్డం భారతి, కురుసం రాజకుమారి, పద్మ, జయమ్మ, తులసి, ఫయాంబీ, సమ్మక్క, షఫియాబీ, అఖిల, రేష, పాపమ్మ, సత్యవతి, సుశీల, దివ్యభారతి, సమ్మక్క, కుమారి, సుశీల, వెంకటరమణ పాల్గొన్నారు.